క్లుప్తంగా

రూ.16వేలకు గణేషుడి లడ్డూ వేలం



వేలంపాటలో లడ్డూను దక్కించుకున్న రామరాజు

ఎస్.రాయవరం : వమ్మవరం గణేషుడి లడ్డూ వేలం రూ.16001 పలికింది. స్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో నిలిపిన బొజ్జ గణపయ్యకు 21 రోజుల పాటు పూజలందించి ఆదివారం అనుపోత్సవం నిర్వహించారు. ఈ మేరకు నిర్వహించిన లడ్డూ వేలం పాటలో రాయి రామరాజు అత్యధికంగా వేలంపాటలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు.

నాగులాపల్లి హైస్కూల్లో కత్తి యుద్ధంపై శిక్షణ

మునగపాక: మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం కత్తియుద్ధంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. హైస్కూల్లో పీటీగా సేవలందిస్తున్న ఎం.సూర్య శిక్షణ ఇస్తున్నారు. క్రీడారంగంలో ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన కత్తి యుద్ధంలో శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని సూర్య కోరారు. కత్తి యుద్ధ క్రీడా రంగంలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

వాడవాడలా భవానీ దీక్షలు



ఉపమాకలో భక్తులతో మాలధారణ చేయిస్తున్న గురుభవానీ రాంబాబు

నక్కపల్లి : మండలంలో వివిధ గ్రామాల్లో భవానీ దీక్షలు ప్రారంభమయ్యాయి. పలువురు భక్తులు అమ్మవారి దీక్షను చేపట్టారు. ఉపమాకలో గురు భవానీ దవర శింగు రాంబాబు భక్తులచే దుర్గా భవానీ మాలధారణ చేశారు. నక్కపల్లి, ఉపమాక, ఎస్.నర్సాపురం, సీతంపాలెం, బోయపాడు, అమలాపురం, దొండవాక, వేంపాడు, బంగారయ్యపేట, గుల్లిపాడు, రేబాక, జగన్నాథపురం గ్రామాల్లో భవానీ దీక్షలు చేపట్టిన వారు అధిక సంఖ్యలోఉన్నారు. మండల, అర్ధ మండల దీక్షలు చేపట్టి విజయదశమిరోజున విజయవాడ అమ్మవారిని దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

సామాజిక భవనం అందుబాటులోకి వచ్చేలా కృషి

మునగపాక: శిథిలావస్థకు గురైన సామాజిక భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు తెలిపారు. తోటాడ పంచాయతీ సంతబయిల శిథిలావస్థలో ఉన్న సామాజిక భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతూ ప్రజలు ఆదివారం ఆయనకు వినతి అందజేశారు. ఇందుకు స్పందించిన ఆయన పంచాయతీ నిధులతో సామాజిక భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. తద్వారా డ్వాక్రా సమావేశాలతో పాటు కాలనీ వాసులు సమావేశాలు నిర్వహించుకునే వీలుంటుందన్నారు.

జీడిపిక్కల ఫ్యాక్టరీలో పాము



హతమైన పాము

కోటవురట్ల : ప్రస్తుత వాతావరణంతో విష సర్పాలు ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. పంట పొలాల్లోనే కాకుండా జనావాసాల్లోకి వచ్చి హడలెత్తిస్తున్నాయి. కె.వెంకటాపురం శివారున ఉన్న జీడిపిక్కల ఫ్యాక్టరీలో ఆదివారం పెద్ద పాము బెంబేలెత్తించింది. సుమారు 7 అడుగుల పొడవున్న పామును చూసి కూలీలు భయంతో పరుగులు తీశారు. సిబ్బంది వెంటనే ఆ పామును కర్రలతో కొట్టి హతమార్చారు.

నేడు సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

కశింకోట: మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట ప్రభుత్వ హైస్కూల్లో సోమవారం బాల బాలికల సెపక్‌తక్రా బాల్ గేమ్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరగనున్నట్లు పీడీ జి.నూకరాజు తెలిపారు. 14 ఏళ్ల, 17 ఏళ్లలోపు విభాగాల్లో సెలక్షన్స్ జరుగుతాయన్నారు. ఇక్కడ ఎంపిక చేసిన జట్లను స్టేట్ మీట్‌కు పంపిస్తామన్నారు.

ఆశాజనకంగా వరిసాగు

- 3142 ఎకరాల్లో వరిసాగు
- అందుబాటులో పుష్కలంగా ఎరువులు



మునగపాక నుంచి వాడ్రాపల్లికి వెళ్లే దారిలో వరిసాగు



అరబుపాలెం ఆర్‌బీకేలో అందుబాటులో ఎరువులు

మునగపాక : రైతే రాజు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని అంటుంటారు. ప్రభుత్వాలు రైతుల కోసం ఆలోచన చేసిన నాడే వ్యవసాయం లాభసాటిగా ఉంటుంది. అలాంటి రైతు కష్టాలు తెలిసిన వ్యక్తిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మన్ననలు అందుకుంటున్నారు. ఫలితంగా పంటల సాగు ఆశాజనకంగా కనిపిస్తుంది. రైతుల కోసం పలు పథకాలు అమలు చేస్తూ రైతుల పెన్నిధిగా జగన్ మోహన్‌రెడ్డి పేరుగాంచారు.

ఆశాజనకంగా వరిసాగు

మండల వ్యాప్తంగా వరిసాగు ఆశాజనకంగా ఉంది. చెరకు సాగు తగ్గిపోవడంతో రైతులు వరి సాగు చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. చెరకులో ఏటా తెగుళ్ల ఉధృతి కారణంగా పెట్టుబడులు రాకపోవడంతో వరి సాగుపై దృష్టి సారిస్తున్నారు. మండలంలోని ఖరీఫ్ వరి సాగు సాధారణ విస్తీర్ణం 3182 ఎకరాలు కాగా ఈ ఏడాది 3142 ఎకరాలకు పైగా వరి సాగు జరిగినట్టు గణాంకాలు తెలుపుతున్నాయి. వర్షాలు కురవడం ఆలస్యం కావడంతో వరిపై కొంతమేర ప్రభావం పడింది. ప్రస్తుతం గ్రామాల్లో వరి పైరు పచ్చగా దర్శనమిస్తుంది. ఎండలు కాయడంతో వరిపైరుకు దోమకాటు వచ్చే అవకాశం ఉందని, ఇందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని వ్యవసాయాధికారులు రైతులకు సూచనలు చేస్తున్నారు.

పుష్కలంగా ఎరువులు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా సేవలందిస్తున్నారు. సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు ఆర్‌బీకేల ద్వారా అందుబాటులోకి తీసుకువస్తున్నారు. డిమాండ్‌కు తగ్గట్టు ఆర్‌బీకేలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీఎస్)ల ద్వారా రైతులకు ఆసేవలు అందుతున్నాయి. ప్రస్తుతం ఎరువులు పుష్కలంగా ఉన్నాయి. వరిసాగులో మోతాదుకు మించి ఎరువులను వినియోగించరాదని అధికారులు వివరిస్తున్నారు. ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉండే అధికారులతో తరచూ సాగుకు సంబంధించి సందేహాలను నివృత్తి చేసుకోవడం ద్వారా పంటల సాగు ద్వారా రైతుకు ఆదాయం సమకూరుతుందనడంలో సందేహం లేదు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాం. మండలంలోని వరిసాగు ఆశాజనకంగా ఉంది. వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు కూడా వరిసాగుపై మక్కువ చూపుతున్నారు. కొన్ని చోట్ల వరిపైరుకు దోమకాటు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున అధికారుల సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి.

– సీహెచ్.జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



రాష్ట్ర పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులతో కోచ్ చందు

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు చందు తైక్వాండో పోటీలకు మండల విద్యార్థులు ఇరువురు ఎంపికైనట్టు కోచ్ చందు ఆదివారం తెలిపారు. శనివారం గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో జరిగిన జరిగిన జిల్లా పోటీల్లో పాల్గొన్నట్టు చెప్పారు. ఈ మేరకు అడ్డురోడ్డు చందు క్లబ్ విద్యార్థులు జి.సాయితేజ్, పి.అదిత్యచరణ్ ఎంపికైనట్టు చెప్పారు. వీరిద్దరూ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు వచ్చే నెలలో జరుగుతాయన్నారు. వీరిని తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.సత్యనారాయణ, పి.అచ్చుత్‌రెడ్డి, అచ్చెన్నాయుడు తదితరులు అభినందించారు.

400 మందికి ఉచిత కంటి పరీక్షలు



బ్రాండిక్స్ కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన 115వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 289 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. 73 మందికి మందులు పంపిణీ చేశారు. 50 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని సూచించారు. రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 15 మంది రక్తదానం చేశారు. శిబిరానికి విచ్చేసిన వారికి ఫలహారం, భోజనం, మజ్జిగ సమకూర్చారు. బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

వాడవాడలా అన్న సమారాధనలు



మునగపాక పల్లపువీధి ఫైర్‌బాయ్స్ ఆధ్వర్యంలో అన్న సమారాధన

మునగపాక: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వాహకులు పలు చోట్ల అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. మునగపాక ఇందిరమ్మ కాలనీ,పల్లపు వీధిలోని ఫైర్‌బాయ్స్ ఆధ్వర్యంలోనూ అలాగే పాటిపల్లి శివారు గొల్లపేట తదితర ప్రాంతాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా వినాయక మండపాలకు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

సర్వకామదాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సర్వకామదాంబ అమ్మవారు



సామూహిక పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమ్మవారికి నిమ్మకాయల పూజ నేత్రపర్వంగా జరిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి శరన్నవ రాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కనకదుర్గమ్మ మాలధారణ, సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్రనామార్చన, విజయదశమి రోజున జమ్మి పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, మహిళా భక్తులు పాల్గొన్నారు.


ముందస్తుగా పశువులకు టీకాలు



జిల్లేడుపూడిలో పశువుకు టీకా వేస్తున్న గోపాలమిత్ర కిల్లాడ వెంకటరమణ

నాతవరం: పశువులకు గాలికుంటు, లంపీ స్కిన్ రాకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేస్తున్నామని గోపాలమిత్రలు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ తెలిపారు. ఆయన ఆదివారం జిల్లేడుపూడి లక్ష్మీపురం ఆర్.వెంకయ్యపాలెం, గోవిందపురం గ్రామాల్లో ప్రభుత్వం సరఫరా చేసిన వ్యాక్సిన్లు పశువులకు వేసి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయాల వారీగా పశువులకు గాలికుంటు, లంపీస్కిన్ రాకుండా వ్యాక్సిన్లు సరఫరా చేసిందన్నారు. ఆయా వ్యాక్సిన్లు పాయకరావుపేట వెటర్నరీ ఏడీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రైతుల కల్లాలు వద్దకే వెళ్లి పశువులకు వేస్తున్నామన్నారు. సీజనల్‌గా పశువులకు వచ్చే వ్యాధులు పట్ల రైతులకు తెలియజేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో 198 మంది గోపాలమిత్రలు ఈ వ్యాక్సిన్లు వేస్తున్నారన్నారు. వీటితోపాటు పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి రామ్మోహన్‌రావు ఆదేశాల ప్రకారం కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చేస్తున్నామన్నారు.

సాంకేతిక విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలని వినతి



మంత్రి బొత్సకు సమస్యలు వివరిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ బృంద సభ్యులు

మాడుగుల: విద్యాపరంగా వెనుకబడిన మాడుగుల నియోజకవర్గంలో ఇంత వరకు సాంకేతిక విద్యా సంస్థ లేదని నియోజకవర్గ ఉద్యోగ, ఉపాధ్యాయ బృంద సభ్యుడు చిరికి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కె.కోటపాడు మండలం మర్రివలస గ్రామానికి విచ్చేసిన విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో కలిసి నియోజకవర్గంలో పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ సమస్యను పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి దృష్టికి బృంద సభ్యుడు శ్రీనివాసరావు తీసుకెళ్లారు. అనంతరం దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

యలమంచిలి : మండలంలో బయ్యవరం గ్రామంలో సోమవారం ఉదయం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని ఎంపీడీవో అప్పలనాయుడు తెలిపారు. ఈ శిబిరానికి ఆరోగ్య సురక్ష టోకెన్లు తీసుకొని వచ్చి ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు, మందులు ఉచితంగా పొందాలని అలాగే వివిధ వ్యాధులకు సంబంధించి సూచనలు, సలహాలు పొందాలని కోరారు.

పెదపాడులో...

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పెదపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించనున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ శిబిరంలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. స్పెషలిస్టు వైద్యులు సైతం ఈ శిబిరంలో వైద్య సేవలు అందించనున్నారు.

నాగులాపల్లిలో...

మునగపాక : మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని ఎంపీడీవో మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మన్మథరావు కోరుతున్నారు.

నేడు శరీర, అవయవ దాతల సంఘ వ్యవస్థాపక వేడుకలు

అనకాపల్లిటౌన్: గవరపాలెం సుంకరమెట్ట జంక్షన్ యల్లపు ఉమామహేశ్వరి ఇంటి ఆవరణలో సోమవారం సాయంత్రం 4 గంటలకు శరీర, అవయవ దాన వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు జి.సీతామహాలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, జిల్లా ఖజానాశాఖ అధికారి వీవీ సుభాషిణి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

15 నుంచి దత్తక్షేత్రంలో దేవీ నవరాత్రులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయరాజు

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో దేవీనవరాత్రుల ఉత్సవాలను ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎం.ఆంజనేయ రాజు, స్థలదాత సీపీ రామారావు తెలిపారు. దత్తక్షేత్ర ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దేవీ నవరాత్రులను పురస్కరించుకుని తొమ్మిది రోజులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమపూజలు, హోమాలు, చండీపారాయణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

తీరంలో సండే సందడి



తిక్కవానిపాలెం తీరంలో సందర్శకులు

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారాయి. గాజువాక, స్టీల్‌ప్లాంట్, సబ్బవరం, లంకెలపాలెం, అనకాపల్లి, పరవాడ, దీపాంజలినగర్ వంటి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో ఆదివారం రెండు బీచ్‌లు కళ కళలాడాయి. పర్యాటకులు తీర ప్రాంతాల్లోని జీడి, సరుగుడు తోటల వద్ద గడిపి అనంతరం బీచ్‌ల్లో ఇసుక మేటల్లో ఆట పాటలతో సందడి చేశారు. సాయంత్రం తీరంలో జలకాలాటలతో సందడి చేశారు. తిక్కవానిపాలెం బీచ్‌లోతాగునీటి సదుపాయం లేక సందర్శకులు అవస్థలు పడుతున్నారు. ముత్యాలమ్మపాలెం తీరంలో నీడ ఉండేలా అభివృద్ధి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన అల్లూరి జట్టు

విజేతగా నిలిచిన అల్లూరి జట్టు

యలమంచిలి : మండలంలో పద్మనాభరాజుపేట, బయ్యవరం గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని మూడు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శనివారం అర్ధరాత్రితో ముగిశాయి. అత్యంత రసవత్తరంగా జరిగిన ఫైనల్ పోటీలలో అల్లూరి జిల్లా, గంగవరం జట్ల మధ్య జరిగిన పోరులో అల్లూరి జిల్లా జట్టు ప్రథమ స్థానం, గంగవరం జట్టు ద్వితీయ స్థానం, సోమలింగపాలెం జట్టు తృతీయ స్థానం దక్కించుకున్నాయి అని ఉత్సవ కమిటీ సభ్యులు మొగలిపల్లి గణేష్, చంద్రగిరి నాని ఆదివారం తెలిపారు. ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో హోరాహోరీగా జరిగిన ఈ పోటీలు తిలకించడానికి రెండు గ్రామాల ప్రజలు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. పోటీల్లో మొదటి స్థానం పొందిన జట్టుకు రూ.15 వేలు నగదు, ద్వితీయస్థానం జట్టుకు రూ.12వేలు, తృతీయస్థానం జట్టుకు రూ.10వేలు బహుమతులు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొన్నాబత్తుల శివ, మొగ్గా గోవిందరావు, ఊటకూటి శేఖర్, జెర్రిపోతుల వెంకట్, ఊటకూటి బాబ్జి, ఊటకూటి రాజీవ్, మొల్లి అప్పారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



మునగపాక బీసీ కాలనీలో డ్రైన్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి అవకాశం కలుగుతుందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మునగపాక సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షల వ్యయంతో బీసీ కాలనీలో నాలుగు చోట్ల డ్రైన్లు నిర్మాణానికి ఆదివారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.20 లక్షల మేర నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. సంబంధిత నిధులతో పలు చోట్ల అభివృద్ధి జరుగుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, జెడ్‌పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అద్భియ్య నాయుడు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, వార్డు సభ్యులు అప్పలనాయుడు, దాడి పోలీసు, వేగి కృష్ణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి కోనపల్లి రామ్మోహన రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కనకలక్ష్మి అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనాలు



ఆకట్టుకున్న డప్పు వాయిద్యాలు



ఆకట్టుకున్న కోలాటం

యలమంచిలి : మండలంలో పద్మనాభరాజుపేట. బయ్యవరం గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయకుని నిమజ్జన మహోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. గ్రామంలో వినాయకుని ప్రతిమను ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తీసుకువెళ్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు చేసిన కోలాటం, తీన్మార్ డప్పు వాయిద్యాలు చూపరులను ఎంతో అకట్టుకున్నాయి.

డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గొన్నాబత్తుల శివ, ఊటకూటి శేఖర్, మొగ్గా గోవిందరావు, ఊటకూటి బాబ్జి, జెర్రిపోతుల వెంకట్, మొగలపల్లి గణేష్, ఊటకూటి రాజీవ్, చంద్రగిరి నాని, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపాలెం వద్ద ఇసుక డిపో ప్రారంభం



డిపోలో జేసీబీతో ఇసుక లోడింగ్

మాకవరపాలెం: కొత్తపాలెంలో ప్రభుత్వ ఇసుక డిపో ప్రారంభించారు. మండలంలోని జగనన్న కాలనీల లబ్ధిదారులకు ఇప్పటివరకు నర్సీపట్నం మండలం గబ్బాడ వద్ద డిపో నుంచి ఇసుకను సరఫరా చేశారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఇబ్బందులను గుర్తించి గృహ నిర్మాణ శాఖ అధికారుల సూచనతో కొత్తపాలెం వద్ద ఇసుక డిపో ఏర్పాటుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. మొదటగా 400 టన్నుల ఇసుక ఇక్కడ డిపోకు చేరడంతో ఆదివారం నుంచి రాచపల్లి, రామన్నపాలెం, జి.కోడూరు, తదితర గ్రామాల లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథం తెలిపారు.

ఘనంగా మోదకొండమ్మతల్లి పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం: దొండపూడిలో మోదకొండమ్మతల్లి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామంలోని సోమునాయుడు కుటుంబీకులు ఇలవేల్పుగా ఈ పండగను ఏటా ఘనంగా నిర్వహిస్తుంటారు. దొండపూడి, కొత్తకోట తదితర గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఆత్మీయ కలయిక.. అపురూప వేడుక



అడ్డూరులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి శివారు రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అట్టహాసంగా జరిగింది. పాఠశాలలో 1989–90లో పదో తరగతి పూర్తి చేసిన వీరంతా అడ్డూరులోని మద్ది గైరమ్మ గుడి ఆవరణలో వీరంతా కలిశారు. సుమారు 33 ఏళ్ల కిందట ఆ పాఠశాలలో చదువుకుని ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా కలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను,అల్లరి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు.అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. గ్రూపు ఫొటోలు తీసుకొని సందడి చేశారు. చదువు చెప్పిన గురువులు సైన్స్ టీచర్ ప్రకాష్ ,తెలుగు టీచర్ ఏసుదాసు,సోషల్ టీచర్ విష్ణు మాస్టర్‌లను పూర్వ విద్యార్థులంతా ఘనంగా సన్మానించారు.